## క్లుప్తంగా

### సీఎం నిర్ణయంపై హర్షం

నెహ్రూనగర్: రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాల్లో 50 శాతం బీసీలకు కేటాయిస్తానని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై తొగట వీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగట వీర క్షత్రియులు, వారి సోదరులైన దేవాంగ, పద్మశాలీ, కర్నాబత్తుల వంటి 18 కులాల చేనేతలు మొత్తం కలిపి రాష్ట్ర జనాభాలో 19 శాతం ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం చేనేతలకు రెండు ఎమ్మెల్సీలు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కోటేశ్వరరావు, మార్కండేయులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీనివాసరావు, చాడేశ్వరి పాల్గొన్నారు.

### డిగ్రీ కోర్సులపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులు, వసతులపై ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిన డిగ్రీ కోర్సుల దిశగా విద్యార్థినులు అవగాహన పెంచుకుని, ప్రవేశం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాధిపతులు ఆయా విభాగాల వారీగా ఉద్యోగావకాశాల్ని వివరించి, సైన్స్ ప్రయోగాలను చూపించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు ప్రవీణ కుమారి (మైక్రోబయాలజీ), కె. కోటేశ్వరరావు (ఆర్థికశాస్త్రం), రసాయనశాస్త్ర అధ్యాపకులు శ్రీలక్ష్మి, కృష్ణారావు, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు నిఖిత, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు కృపావాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు అఖండ సంగీతార్చన

పాత గుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ మందిరంలో శనివారం శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకురాలు ఎ. భారతీదేవి ఆధ్వర్యంలో 12వ అఖండ సంగీతార్చన, సంగీత, వాద్య, నృత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డి. శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6.30 గంటలకు నాద స్వరంతో కార్యక్రమం ప్రారంభమై, ఆదివారం ఉదయం 6 గంటలకు మంగళహారతితో ముగుస్తుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

### నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీ శుభాంజలి కళా వేదిక ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే విభావరి అనంతరం గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అవార్డు పొందిన ఎంఈఓ చీకటి రవికాంత్‌ను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

### కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

గుంటూరు ఎడ్యుకేషన్: కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై భౌతికదాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది ప్రభుత్వాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఉపాధ్యాయుల్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్న పరిస్థితుల్లో వారితో స్నేహపూరితంగా ఉంటూ పని చేయించే ప్రతాప్‌రెడ్డిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. తన ప్రతి సమావేశాన్ని లైవ్‌లో రికార్డ్ చేసి యూట్యూబ్‌లో ఉంచుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు గురువారం జరిగిన సమావేశంలో ఉన్నాయని భావిస్తే తగిన సాక్ష్యాధారలతో ఎన్నికల అధికారులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలే గానీ విద్యాశాఖలో ఒక అధికారిపై భౌతిక దాడులకు పాల్పడటం సిగ్గుచేటని ఖండించారు.

### బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... సాయికృష్ణ నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గజిట్ ప్రకారం కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచుతామని చెప్పి పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 నుంచి సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు నామతోటి రాణి, మందా రాజేష్, ఎం.పద్మ, సుబ్బాయమ్మ, సుమలత, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రికార్డ్ రూము అవినీతిపై గరం గరం

- విజిలెన్స్ ఎంక్వయిరీకి డెప్యూటీ మేయర్ వనమా డిమాండ్
- కౌన్సిల్‌లో పలు సమస్యలపై వాడీవేడి చర్చ
- అధికారులపై ధ్వజమెత్తిన కార్పొరేటర్లు



ఎంపీ గల్లా జయదేవ్ మిస్సింగ్ అంటూ ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బూసి రాజలత

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ రికార్డ్ రూము నిర్వహణలో అవకతవకలు జరిగాయని, దీనిపై పూర్తి చేపట్టాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) డిమాండ్ చేశారు. రికార్డు రూము నుంచి డిమాండ్ నకళ్లు కాపీలను 916 ఆథరైజ్ చేసి ఇచ్చారని, దీనిలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. వెహికల్ షెడ్‌లో అక్రమాలపై గత కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. వెహికల్ షెడ్ నిర్వహణలో భారీ స్థాయిలో అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంజినీరింగ్ సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో కూడా ఎవరికి తెలియదని...దీనికి సంబంధించిన సచివాలయం వారీగా జాబ్ చార్ట్ ఇవ్వాలని అధికారుల్ని కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు వాపోయారు.దీనిపై అదనపు కమిషనర్ పెద్ది రోజా మాట్లాడుతూ వీలైనంత త్వరలో రికార్డు రూమ్ అంశంపై నిగ్గు తేలుస్తామని చెప్పారు. శుక్రవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల 76 ప్రశ్నలపై సుదీర్ఘ చర్చ జరిగింది. 104 సభ్యుల ప్రతిపాదనలు, 19 కార్పొరేషన్ ప్రియాంబుల్స్‌ను కౌన్సిల్ ఆమోదించింది.

**అడ్వర్‌టైజింగ్ ట్యాక్స్ వసూలులో భారీగా అవకతవకలు**

అడ్వర్‌టైజింగ్ (హోర్డింగ్స్) ట్యాక్స్ వసూళ్లలో పట్టణ ప్రణాళిక అధికారులు భారీ స్థాయిలో అవకతవకలకు పాల్పడుతున్నారని, దీనిపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి నిగ్గు తేల్చాలని కార్పొరేటర్ షేక్ రోషన్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. మీడియా డిస్‌ప్లే డివైజ్ ఫీజులు 2017 నుంచి 2022 వరకు రూ.18,70,97,233 డిమాండ్ ఉండగా రూ.14,39,99,542 వసూలు చేశారన్నారు. ఇంకా రూ.4,30,97,691 బకాయి ఉందన్నారు. ప్రస్తుత సంవత్సరానికి రూ.8,22,04,200 బకాయిలు ఉన్నాయని...వీటిని పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పుడు వసూలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. చిన్న చిన్న ఏజెన్సీల్ని వేధించే అధికారులు, పెద్ద పెద్ద ఏజెన్సీల వారు కోట్లలో బకాయిలునప్పటికీ పట్టించుకోరని రోషన్ ఆరోపించారు. అధికారికంగా చూపించే బోర్డులు కాకుండా అదనంగా నగరంలో 76 బోర్డులు ఉన్నాయని, వీటి నుంచి ఆయా డివిజన్ టౌన్ ప్లానింగ్ అధికారులే వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి పూర్తి స్థాయిలో నిగ్గు తేల్చాలని కోరారు. హోర్డింగ్స్ నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించి కార్పొరేషన్‌కు ఆదాయం పెంచే మార్గాలను చూడాలని డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు సూచించారు.

**అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి**

గుంటూరు నగరంలో 73 అనధికార లే అవుట్లు ఉన్నాయని, వాటిపై ఇంత వరకు చర్యలు తీసుకోలేదని, ఒక లే అవుట్ పరిధిలో రోడ్లు లేకపోయినప్పటికి ఉన్నట్లు చూపించి ప్లాన్ తీసుకున్నారని ఆధారాల సహా కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి కౌన్సిల్ ముందు ఉంచారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. అనధికార లే అవుట్లపై విచారణ చేపట్టాలని మేయర్ అధికారుల్ని ఆదేశించారు.

**వీధి లైట్లు లేక ప్రజలకు ఇబ్బందులు**

రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో వీధీ లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ధనలక్ష్మి, మీరావలి, రిహాన కౌన్సిల్‌లో లేవనెత్తారు. ప్రతి వార్డులో ఇదే పరిస్థితి నెలకొందని, అధికారులు లైట్లు వేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఫలితం లేదని విమర్శించారు. సమస్యకు పరిష్కారం చూపాలని ఇంజినీరింగ్ అధికారుల్ని మేయర్ ఆదేశించారు. అవసరమైతే లైట్లు కొనేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ఏఈలను నియమించాలని చెప్పారు.

**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై చర్యలు**

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కో- ఆప్షన్ మెంబర్ పూనూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అకౌంటెంట్ సిరిల్ పాల్ కార్పొరేషన్ సొమ్ము రూ.50లక్షలు దుర్వినియోగం చేశారని, దాన్ని ఏవిధంగా రికవరీ చేస్తారని ప్రశ్నించారు. సిరిల్ పాల్ ఆస్తుల వివరాలను తెలుసుకుంటున్నామని, వీలైనంత త్వరలో విచారణ చేపట్టి నగదు రికవరీ చేస్తామని అదనపు కమిషనర్ రోజా తెలియజేశారు.

**నగరపాలక సంస్థ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి**

నగరపాలక సంస్థ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న నగరపాలక సంస్థ స్థలాల్లో సచివాలయాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, బోడపాటి ఉషారాణి విజ్ఞప్తి చేశారు.

### కార్పొరేటర్ కృష్ణారెడ్డికి ఘన నివాళి



నెహ్రూనగర్: 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ తనుబుద్ధు కృష్ణారెడ్డికి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్లు డైమండ్‌బాబు, షేక్ సజీల, కార్పొరేటర్లు శుక్రవారం నగరపాలక సంస్థ ఆవరణలో ఘన నివాళులర్పించారు. అనంతరం ఒకటో డివిజన్ కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తన వార్డులో నూతనంగా పార్కు నిర్మించారని, దానికి కృష్ణారెడ్డి పేరు పెట్టాలని ప్రతిపాదించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.

# మహా శివరాత్రికి శివాలయాల ముస్తాబు

పాత గుంటూరు: మహా శివరాత్రి వేడుకలకు నగరంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందిళ్లు, పూలదండలు, విద్యుత్ దీపకాంతులతో అందంగా అలంకరించారు. నగరంలో ప్రసిద్ధి చెందిన కొత్తపేట శివాలయం, పాత గుంటూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయం, అరండల్‌పేట శివాలయం తదితర దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, స్వామి కల్యాణం నిర్వహిస్తారు.

- పాత గుంటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం మధ్యాన్నం 2 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 10.30 గంటలకు స్వామికి లింగోద్భవ అభిషేకం, ఒంటి గంటకు కల్యాణ మహోత్సవం, 19న సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- కొత్తపేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభిషేకాలు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు అభిషేకాలు, 10 గంటల నుంచి స్వామి కల్యాణ మహోత్సవం, లింగోద్భవ అభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో శివారెడ్డి తెలిపారు.
- ఏటీ అగ్రహారం ఒకటో లైనులోని కంచి కామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, రుద్రహవనం, శివసహస్రనామ స్తోత్ర పారాయణ, శివపార్వతుల శాంతి కల్యాణం, గాయత్రీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, లింగోద్భవ సమయంలో 11 మంది వేద పండితులతో మహారుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు రాళ్లబండి వేంకట సత్య రామాంజనేయశర్మ తెలిపారు.



భక్తుల సౌకర్యార్థం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన షామియానాలు



పాత గుంటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం



కొత్తపేట శివాలయం

## ముగిసిన ధ్యాన మందిరం దశాబ్ది ఉత్సవాలు

పాత గుంటూరు/పట్నంబజారు: కొత్తపేట శ్రీ గణేశ్వరరావు వీధిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం దశాబ్ది వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం వేకువజామున కాకడా హారతి, నిత్య పూజలు అనంతరం బాబాకి పంచామృత అభిషేకాలు జరిపారు. పండితుడు శ్రీకాంత్ శర్మ నేతృత్వంలో ఉప్పలపాటి నాగసాయి పౌరోహిత్యంలో శ్రీ సాయి సత్యవ్రతాలు ఘనంగా నిర్వహించారు. హారతి అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. తూర్పు శాసన సభ్యుడు షేక్ మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ నేతలు నూరి ఫాతిమా, కార్పొరేటర్ యాట్ల రవి, పార్టీ నేత పి. రామయ్య తదితరులు బాబాను దర్శించుకున్నారు.



షిర్డీ సాయినాథుడికి ఎమ్మెల్యే ముస్తఫా పూజలు

## నిందితులను కఠినంగా శిక్షించాలి



నెహ్రూనగర్: కోనసీమ జిల్లాలో 17 సంవత్సరాల మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం చేసిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని రజక సమైక్య పోరాట సమితి కన్వీనర్ అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లో శుక్రవారం సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం ఉండటం లేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రజక మహిళలపై అత్యాచారాలను అడ్డుకట్టవేసే విధంగా ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పూర్ణచంద్రరావు, శ్రీరాములు, వసంత్, వెంకట్రావు, కృష్ణా, పాపారావు, లక్ష్మయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## పర్యావరణ హిత ఉత్పత్తుల దిశగా ఆలోచన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: భావి పారిశ్రామికవేత్తలుగా ఎదిగే విద్యార్థులు పర్యావరణ హితం కోరే వస్తూత్పత్తి దిశగా ఆలోచన చేయాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంకాం విద్యార్థులకు'' సృజన-మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్'' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వ్యాపార ప్రణాళిక పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎస్వీ రమణ మాట్లాడుతూ పోటీలకు 15 బృందాలుగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతి బృందంలో విద్యార్థులు సీఈవో, మార్కెటింగ్ మేనేజర్, హెచ్ఆర్ మేనేజర్‌తో పాటు ప్రొడక్షన్ మేనేజర్‌గా ఏర్పడి తమ వ్యాపార ప్రణాళికలను వ్యక్త పరిచారని తెలిపారు. వారి ఆలోచన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా న్యాయనిర్ణేతల ఎదుట ప్రదర్శించారని, పర్యావరణంలో కాలుష్య నివారణకు ప్రాధాన్యత ఇస్తూ పర్యావరణహిత సామగ్రిని ఉత్పత్తి చేసే విధానాల్ని వివరించారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాల్ని ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీభావన డెవలపర్స్ ఎండీ కె. శ్రీధర్‌బాబు, ఇన్‌టాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ అందజేశారు. కార్యక్రమంలో సృజన పోటీల కన్వీనర్ డి. కళ్యాణి, కో-కన్వీనర్ కె. లలిత, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అధ్యాపకులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, ఏ.బాజీబాబు, ఎన్. అశోక్‌బాబు, యు. పద్మావతి, పి. అనిత, అభిలాష్ పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఎస్వీ రమణ, శ్రీధర్‌బాబు, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు

## మండలాభివృద్ధికి సమష్టిగా కృషి

గుంటూరు రూరల్: మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుకునేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్య పేర్కొన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్య ఉన్న గ్రామాల్లో వెంటనే ప్రణాళికలు సిద్ధం చేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎంపీపీ పులగం దివ్య మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండల స్థాయిలోని పలు విభాగాల అధికారులు గత సమావేశం నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం చేయాల్సిన పనుల్ని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయ, తదితర రంగాల్లోని రాయితీల్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి, దర్శి సుజాత, ఎంపీటీసీ సభ్యులు కాకాని రమేష్, ఉడతా భూలక్ష్మి, పులిమి నాగరాజు, సర్పంచులు, గ్రామాల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోనే మహిళా సాధికారత సాధన



విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో స్టెప్ సీఈవో పల్లవి, వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే మహిళా సాధికారత సాధన సాధ్యమని యువజన సర్వీసుల శాఖ-స్టెప్ సీఈవో ఎస్.పల్లవి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం మహిళా రక్షణ-స్వావలంబనపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ-నెహ్రూ యువకేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లవి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడంతో హక్కుల గురించి అవగాహన లభిస్తుందని తెలిపారు. ఎన్నుకున్న వృత్తిలో రాణించేందుకు, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనలోనూ ఆర్థికంగా, స్వతంత్రంగా ఉండేందుకు విద్య దోహదం చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు భేటీ బచావో అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని వారి విద్యకు పూర్తి సహకరించాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యంతో పాటు స్వయంగా జీవించే శక్తి కోసం మహిళలంతా పాటుపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ జీవితాన్ని ఎంచుకున్న విధంగా జీవించడం మన హక్కుఅని, ప్రతి బాలిక, మహిళ దీన్ని గ్రహించడంలో సహాయం చేయడమే మహిళా-సాధికారత కార్యకలాపాల లక్ష్యం అని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళా రక్షణ, ఆర్థిక స్వావలంబనపై నిర్వహించిన ఉపన్యాస, డ్రాయింగ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.సంతోష్‌కుమారి, స్టెప్ మేనేజర్ బి.రాధిక, దిశా వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె.శాంతి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం. శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైడు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్ షేక్ ఫర్జానా తదితరులు

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్ ఎల్ఆర్ కాలనీ, గాంధీనగర్‌లో రూ 1.20 కోట్లతో నిర్మించనున్న సైడు కాల్వల నిర్మాణాలకు శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజల సౌకర్యార్థం సైడు కాల్వల నిర్మాణాల్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యాదాల చిన్న, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వేముల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గోపీనాయుడు, అంగడి పిచ్చయ్య, మస్తాన్‌వలి, మరియదాసు, అంకమ్మరావు, పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికతోనే ఒత్తిడి, భయం నివారణ



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణభరత్

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షల వేళ సరైన ప్రణాళిక ద్వారా విద్యార్థుల్లో కలిగే భయాలు, ఒత్తిడిని అధిగమించవచ్చని సైకాలజిస్ట్ కృష్ణభరత్ పేర్కొన్నారు. చంద్రమౌళినగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో శుక్రవారం భాష్యం మెడెక్స్ కళాశాల, భాష్యం ఐఐటీ విద్యార్థులకు పరీక్షల భయాన్ని, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణభరత్ మాట్లాడుతూ జ్ఞానేంద్రియాల ద్వారా సమాచారం మానవ మెదడుకు అందుతుందని, అందులో ముఖ్యంగా నేత్రాల ద్వారా మనం చూసిన చిత్రం దాని తాలూకు సమాచారమంతా నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు. అందువల్ల మనం ఊహాశక్తిని ఉపయోగించుకుని మెదడుకు సరైన సంకేతాల్ని అందించడం ద్వారా భయాన్ని, ఒత్తిడిని అధిగమించి రానున్న పరీక్షలకు సునాయాసంగా సమాయత్తం కావచ్చని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళనల్ని తొలగించి వారిలో మానసికస్థైర్యాన్ని నింపడానికి భాష్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులంతా ఉన్నత విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు



రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేస్తున్న వెంకటనాయుడు తదితరులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయంతోపాటు ఆరోగ్యకరమైన పంటల్ని రైతులు పండించవచ్చని శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. వెంకటనాయుడు తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విస్తరణ సంచాలకుడు మాట్లాడుతూ నిరంతరమైన సుస్థిరమైన వ్యవసాయాన్ని ఒక ప్రత్యామ్నాయంగా రైతులు మలుచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో మట్టి, సహజ వనరుల వినియోగం, పంటల సాగు విధానం, నీటి, వాయుకాలుష్యం, తదితర విషయాలను వివరించారు. కేవీకే ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూమి, వాయు, వాతావరణ కాలుష్యంతో పాటు ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సామగ్రి, జీవన ఎరువుల్ని రైతులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. గంగాదేవి, డాక్టర్ అనిల్, డాక్టర్ దీప, డాక్టర్ అర్చనతో పాటు 112 మంది రైతులు, మూడు జిల్లాల రైతు సాధికార సంస్థ, ఏపీసీఎంఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.